క్లుప్తంగా

ఎన్నికల కోడ్ పక్కాగా అమలు చేయాలి

గుంతకల్లుటౌన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో నియోజకవర్గంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి పకడ్బందీగా అమలు చేయాలని ఆర్‌డీఓ రవీంద్ర, కమీషనర్ శేషన్న, తహసీల్దార్ రాము సిబ్బందికి సూచించారు. శుక్రవారం ఎన్నికల ప్రవర్తనా నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్) గురించి మున్సిపల్, రెవెన్యూ, వార్డు సచివాలయ సిబ్బందికి వివరించారు. కోడ్ ఉల్లంఘన జరగకుండా చూడాలన్నారు. రాజకీయ పార్టీల నాయకులు ఇందుకు సహకరించాలని కోరారు.

రేపు చితంబర స్వామి తిరునాల

గార్లదిన్నె: మండలంలోని పెనకచెర్లలో ఆదివారం చితంబరస్వామి తిరునాల నిర్వ హించనున్నారు. ఈసందర్భంగా శివరాత్రి జాగరణ మరుసటి రోజు చితంబరస్వామి తిరునాల జరపడం అనవాయితీ. అదే రోజు రాత్రి చితంబరస్వామి రథోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. చుట్టు పక్కల గ్రామాల నుంచేగాక జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. ఇప్పటికే ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

కాశీ విశ్వేశ్వరాలయంలో అన్నదానం


అన్నదానాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ

గుత్తి: పట్టణంలోని కాశీ విశ్వేశ్వర(శివాలయం) ఆలయ ప్రాంగణంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని శుక్రవారం ఆలయ పూజారులు, శివ మాలాధారులు, భక్తులు ఆధ్వర్యంలో భారీ అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ వన్నూర్‌బీ ప్రారంభించారు. ఈ సందర్భంగా సుమారు ఐదు వేల మందికి అన్నదానం చేశారు. అంతకు ముందు శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు భారీగా తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.

108 మెకానిక్ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

తాడిపత్రి టౌన్ : అనంతపురం జిల్లాలో 108 అంబులెన్స్ సర్వీసెస్‌లో ఖాళీగా ఉన్న మెకానిక్‌గా పోస్టులకు శనివారం లోపు దరఖాస్తు చేసుకోవాలని 108, 104 సర్వీసెస్ డిస్ట్రిక్ట్ మేనేజర్ శివ మనోజ్ ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణతోపాటు ఐటీఐలో డీజిల్ మెకానిక్ చదివిన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. శనివారం లోపు అనంతపురం 108 కార్యాలయంలో రెజూమ్స్ అందజేయాలని కోరారు.

డైరీ ఆవిష్కరణ


డైరీని ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ నిర్మలాకుమారి

శింగనమల: గ్రామ/ వార్డు సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్ల నూతన డైరీని శుక్రవారం ఎంపీడీఓ నిర్మలాకుమారి తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అనేక సంక్షేమ పథకాలకు లబ్ధిదారులను ఎంపిక చేయడంలో వెల్ఫేర్ అసిస్టెంట్లు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించిన మన్ననలు పొందాలని సూచించారు. అనంతరం డైరీలను వారికి అందించారు. కార్యక్రమంలో మండలంలోని సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

బుగ్గ ఆలయం ముస్తాబు

తాడిపత్రి టౌన్: దక్షిణ కాశీగా ప్రసిద్ధి గాంచిన బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయం మహా శివ రాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. భక్తుల కోర్కెలు తీర్చే దేవుడిగా బుగ్గరామలింగేశ్వరుడికి పేరుంది. ఆలయంలో శనివారం మహా శివరాత్రి వేడుకలు జరగనున్నాయి. దీంతో ఆలయాన్ని రంగు,రంగుల పూలు, పందిళ్లు, శామియానాలతో అలంకరించారు. గర్భగుడితోపాటు ఆలయ ఆవరణమంతా పూలతో ముస్తాబు చేశారు. స్వామి దర్శనం కోసం క్యూలైన్లు, బారికేడ్లు, మంచినీటి సదుపాయం ఏర్పాటు చేశారు. ఆలయ ప్రధాన ద్వారం వద్ద ఇత్తడి రంగుతోనున్న ద్వారం ఏర్పాటు చేశారు. శనివారం తెల్లవారు జామున 4 గంటల నుంచి రాత్రి వరకు స్వామి దర్శనం కల్పించనున్నారు. నంది వాహనంపై అమ్మవారు, స్వామి ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు పాలిశెట్టి ఆంజనేయులు తెలిపారు. అలాగే రాత్రి జ్యోతి, లింగోద్భవ దర్శనాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.


గాజుల అలంకరణలో రాజరాజేశ్వరి అమ్మవారు


భక్తుల కోసం ఏర్పాటు చేసిన బారికేడ్లు, షామియానాలు


బుగ్గరామలింగేశ్వరస్వామి మూలవిరాట్

స్పేస్ ఎడ్యుకేషన్‌పై అవగాహన


విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న రుఖియా బేగం

గుత్తి: పట్టణంలోని అనంతపురం రోడ్డులో విరూపాక్షి రెడ్డి కన్వెన్షన్ హాల్లో శుక్రవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్పేస్ ఎడ్యుకేషన్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏపీ మహిళా కమిషన్ సభ్యురాలు లయన్ రుఖియా బేగం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సైంటిస్టు శివ ప్రసాద్, మండల విద్యాధికారి రవి నాయక్‌లు స్పేస్ ఎడ్యుకేషన్ యొక్క ఆవశ్యకతను వివరించారు. స్పేస్ ఎడ్యుకేషన్‌తో భవిష్యత్తులో ఉన్నత స్థానాలు అధిరోహించవచ్చన్నారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించిన ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ చార్టెర్డ్ ప్రతినిధి విరూపాక్షి రెడ్డి, లయన్స్ క్లబ్ సభ్యులు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

20న మండల సర్వసభ్య సమావేశం

పుట్లూరు: మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 20న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ యోగానంద రెడ్డి తెలిపారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, అన్నిశాఖల అధికారులు హాజరు కావాలన్నారు. ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా సమావేశంలో కొత్త తీర్మానాలు, ఆర్థిక పరమైన ఆమోదాలు ఉండవన్నారు.

22న బుక్కరాయసముద్రంలో..

బుక్కరాయసముద్రం: ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 22న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ తేజోత్స్న ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

రీ సర్వేతో భూ వివాదాలకు చెక్


డ్రోన్ పనితీరు తెలుసుకుంటున్న ఆర్‌డీఓ రవీంద్ర, కమిషనర్ శేషన్న

గుంతకల్లుటౌన్: భూ వివాదాలను పరిష్కరించడమే లక్ష్యంగా ఏపీ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు–భూరక్ష పథకాన్ని అమలు చేస్తోందని ఆర్‌డీఓ రవీంద్ర, మున్సిపల్ కమిషనర్ బండిశేషన్న పేర్కొన్నారు. శుక్రవారం పట్టణ శివార్లోని కొనకొండ్ల రోడ్ వద్ద డ్రోన్ ద్వారా రీసర్వే ప్రక్రియను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీలో దాదాపు వందేళ్ల తర్వాత ప్రభుత్వం భూముల రీసర్వే చేపడుతోందన్నారు. ఇందుకోసం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నట్లు పేర్కొన్నారు. భూసర్వే చేపట్టి యజమానులకు క్యూఆర్ కోడ్‌తో కలిగిన భూహక్కు పత్రాలను అందజేస్తామన్నారు. ఎయిరోడైన్ అనే ప్రైవేట్ సంస్థ ఎయిర్‌క్రాఫ్ట్ డ్రోన్ ద్వారా 48 చదరపు కి.మీ విస్తీర్ణం గల పట్టణంలో మూడు రోజుల పాటు రీసర్వే చేస్తుందన్నారు. రీసర్వేతో పట్టణంలో ఇళ్లు కలిగిన వారికి ఆస్తి పన్ను పెంచుతారన్న అపోహలు వీడాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏసీపీ కెఎండీ.ఇసాక్, తహసీల్దార్ బి.రాము, రీసర్వే డీటీ ఆదినారాయణ, మున్సిపల్ ఇంజనీర్ విశ్వనాథ్, ఆర్‌ఓ నాసిర్, మెప్మా టీపీఆర్‌ఓ మోహన్, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ మురళీ, ఆర్‌ఐ ఎర్రిస్వామి, వీఆర్‌ఓలు, ప్లానింగ్ సెక్రటరీలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి కోన తిరునాల


అలంకరణలో రామలింగేశ్వర స్వామి

యాడికి: మహా శివరాత్రికి శైవక్షేత్రాలు ముస్తాబయ్యాయి. మండలంలో ప్రసిద్ధి గాంచిన కోనుప్పలపాడు సమీపం కోనలో వెలసిన కోన రామలింగేశ్వర స్వామి ఆలయంలో శనివారం నుంచి తిరునాల జరగనుంది. ఏటా మహా శివరాత్రి వేడుకలు అత్యంత వైభవంగా జరుగుతాయి. ఇందులో భాగంగా ఇప్పటికే ఆలయానికి రంగులు పూశారు. బయట ఉన్న నీటి గుండంలో పూడిక మట్టిని తొలగించారు. ప్రత్యేక పూజలు, హోమాలు, స్వామి వార్లకు కల్యాణం వంటి కార్యక్రమాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా నుంచే కాకుండా కర్నూలు, కడప జిల్లాల నుంచి వేలాది మంది కోన రామలింగేశ్వరుడిని భక్తులు దర్శించుకుంటారు. తిరునాల శనివారం నుంచి మూడు రోజుల పాటు జరగనుంది. తొలిరోజు సాయంత్రం పుట్టమన్ను తెచ్చుట, రాత్రి రాయబారం, 19న తెల్లవారుజామున 5 గంటలకు స్వామి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. అదే రోజు మధ్యాహ్నం గ్రామానికి చెందిన కోన బ్రదర్స్ ఆధ్వర్యంలో అన్నదానం, 2 గంటల నుంచి రథోత్సవం జరగనుంది. అలాగే 20న వసంతోత్సవం, అన్నదానం ఉంటుంది. తిరునాల ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు కోనా జగదీశ్వరరెడ్డి, కోనా వెంకటశివారెడ్డి తెలిపారు.

బాధ్యుల నుంచి సొమ్ము రికవరీ చేయండి


ఉపాధి సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా విజిలెన్స్ అధికారి రమణారెడ్డి

యాడికి: ఉపాధి హామీ పనుల్లో అక్రమాలు, అవినీతికి సంబంధించిన మొత్తాన్ని బాధ్యుల నుంచి రికవరీ చేయాలని జిల్లా విజిలెన్స్ అధికారి రమణారెడ్డి ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా విజిలెన్స్ అధికారి మాట్లాడుతూ 2020–21, 2021–22లో ఉపాధి పనుల్లో రూ.70 వేల దాకా పక్కదారి పట్టిందని ఆ సొమ్మును బాధ్యుల నుంచి రికవరీ చేయాలన్నారు. మండలంలో జరుగుతున్న సామాజిక తనిఖీల్లో డీఆర్పీలు అవకతవకలు లేకుండా చూడాలన్నారు. అవినీతి సొమ్ము రికవరీ చేయకపోవడంతో అధికారులపై మండిపడ్డారు. కార్యక్రమంలో ఏపీఓ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆర్థిక సాయం

పామిడి: తంబళ్ళపల్లి గ్రామానికి చెందిన లక్ష్మీదేవికి శుక్రవారం గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి రూ.10 వేలు ఆర్థికసాయం అందించారు. లక్ష్మీదేవి కుమారుడి వైద్యఖర్చుల నిమిత్తం ఎమ్మెల్యే నగదు అందజేశారు.

వ్యక్తి ఆత్మహత్య


వీరన్న(ఫైల్)

యాడికి: కడుపునొప్పి తాళలేక ఓ వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. జీఆర్పీ ఎస్‌ఐ నాగప్ప వివరాల మేరకు..మండలంలోని పెద్దపేట గ్రామానికి చెందిన వీరన్న(76)కు ఇద్దరు భార్యలు, నలుగురు కుమారులు. వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. వీరన్నకు కొంతకాలంగా కడుపునొప్పితో పాటు మోకాళ్ల నొప్పి ఉండేది. శుక్రవారం నొప్పి అధికంగా రావటంతో గ్రామానికి సమీపంలో గల రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. గొర్రెల కాపరుల ద్వారా సమాచారం అందుకున్న జీఆర్పీ ఎస్‌ఐ నాగప్ప ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రాతిదూలం లాగుడు పోటీలు ప్రారంభం


పోటీలు ప్రారంభిస్తున్న దృశ్యం

పామిడి: మండలంలోని పెన్నప్పగుడి 22వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వంకరాజుకాల్వ, నెమళ్లపల్లి గ్రామస్తుల ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి రాతిదూలం లాగుడు పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మొదటిరోజు న్యూకేటగిరి విభాగానికి సంబంధించి పోటీలను గుత్తి మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ పెమ్మక చెన్నకేశవరెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. శనివారం ఆరుపళ్ళ విభాగం పోటీలు జరగనున్నాయి.

23న ఓపెన్ ఎయిర్ జైల్లో వేలం

బుక్కరాయసముద్రం: ఓపెన్ ఎయిర్ జైల్లో ఈనెల23న వేలం పాట నిర్వహిస్తున్నట్లు సూపరింటెండెంట్ చిన్నారావు ఓ ప్రకటనలో తెలిపారు. వీటిలో ఆవులు 7, బర్రెలు 4, ఎద్దులు 4, దున్నలు 4 ఉన్నాయని పేర్కొన్నారు. డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని, వేలం ముగిసిన తరువాత డిపాజిట్ వెనక్కి చెల్లిస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు, వ్యాపారస్తులు వేలం పాటలో పాల్గొనొచ్చని తెలియజేశారు.

పోలీసుల సోదాలు


గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ వేణుగోపాల్

యల్లనూరు: పల్లెల్లో గొడవలకు దిగి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని సీఐ వేణుగోపాల్ హెచ్చరించారు. అచ్యుతాపురంలో శుక్రవారం వేకువజామున నాకాబందీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నేర చరిత్ర కల్గిన వ్యక్తుల, అనుమానితుల ఇళ్లు, గడ్డి వాముల్లో సోదాలను నిర్వహించారు. సీఐ గ్రామసభ నిర్వహించి గొడవలకు దూరంగా ఉండాలని ప్రజలకు సూచించారు. యల్లనూరు, పుట్లూరు ఎస్‌ఐలు రామకృష్ణ, వెంకటప్రసాద్, పోలీసులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం సక్రమంగా అందజేయాలి

యాడికి: గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం క్రమం తప్పకుండా అందించాలని సీడీపీఓ సాజిదాబేగం సిబ్బందికి సూచించారు. శుక్రవారం లక్షుంపల్లె, కేశవరాయుని పేట అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేసి పలు రికార్డు లను పరిశీలించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ ప్రతి నెలా బాలింతలు, గర్భిణులు వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. కేంద్రాలకు రాని బాలింతలకు పౌష్టికాహారం వారి ఇళ్ల వద్దే అందజేయాలన్నారు. అనంతరం బాలింతలు, గర్భిణులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు. ఆరు నెలలు నిండిన చిన్నారులకు అన్న ప్రాసన కార్యక్రమం నిర్వహించాలని సిబ్బందికి సూచించారు.

ఆర్చరీ క్రీడా పోటీల్లో సత్తా చాటిన జిల్లా క్రీడాకారులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీల్లో సత్తాచాటిన జిల్లా క్రీడాకారులను డీఈఓ సాయిరాం అభినందించారు. స్థానిక జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతపురం జిల్లా క్రీడాకారులు మన్యం జిల్లా పార్వతీపురంలో జరిగిన 66వ రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీల్లో అండర్–14 బాలికల జట్టు ప్రథమ స్థానాన్ని, బాలుర విభాగం జట్టు ద్వితీయ స్థానం, అండర్–17 విభాగంలో బాలుర జట్టు ద్వితీయ స్థానంలో రాణించడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి రవికుమార్, మేనేజర్ రామాంజినమ్మ, పీడీ అసోసియేషన్ అధ్యక్షుడు మొరార్జీయాదవ్ పాల్గొన్నారు.

ఆధార్ నవీకరణ చేయించుకోండి

- డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఓబులమ్మ

అనంతపురం సిటీ: ప్రతి ఒక్కరూ ఆధార్ నవీకరణ చేయించుకోవాలని అనంతపురం డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (డీఎల్‌డీఓ) చిలంకూరు ఓబుళమ్మ శుక్రవారం తెలిపారు. 2010 నుంచి 2016 ఏప్రిల్ నెలాఖరులోపు ఆధార్ కార్డుదారులు అప్‌డేట్ చేయించుకోవాలన్నారు. ప్రతి మండలంలో రెండేసి చొప్పున గ్రామ సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పేరు, పుట్టిన తేదీ, నివాస స్థలానికి సంబంధించిన అన్నీ ఆధారాలు కలిగిన ఒరిజినల్ డాక్యుమెంట్లు తీసుకెళ్లి అప్‌డేట్ చేయించుకోవాలన్నారు. లేకపోతే ఆధార్ కార్డు పనికి రాకుండాపోతుందని హెచ్చరించారు.

జూదరుల అరెస్ట్

తాడిపత్రి అర్బన్: పట్టణంలో పేకాటాడుతున్న 9 మంది జూదరులను అరెస్టు చేసినట్లు పట్టణ పోలీసులు తెలిపారు. వివరాలు..పట్టణంలోని శివాలయం సమీపంలోని శ్మశానవాటికలో పేకాటాడుతున్నారన్న సమాచారం అందుకున్న ఎస్‌ఐ ధరణీబాబు తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఓంశాంతి నగర్‌కు చెందిన తలారి శివ, శ్రీనివాసనాయుడు, శివాలయం వీధికి చెందిన షేక్ రహంతుల్లా, అనంతపురం రాణీనగర్‌కు చెందిన వడ్డే రామాంజి, తాడిపత్రి గాంధీకట్ట సమీపంలోని ఎం.ధనుంజయలతో పాటు మరో నలుగురిని అరెస్టు చేసి రూ.19 వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఫ్రైడే డ్రైడే కార్యక్రమం తనిఖీ

అనంతపురం సప్తగిరి సర్కిల్: నగరంలోని నాయక్‌నగర్‌లో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలోని కృపానంద నగర్‌లో జరుగుతున్న ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని శుక్రవారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వీరబ్బాయి తనిఖీ చేశారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు తప్పనిసరిగా ఫ్రైడే డ్రైడేను పాటించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి ఓబులు, సబ్ యూనిట్ అధికారి మద్దయ్య, సయ్యద్‌నూర్ బాషా, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి ప్రతిష్టాపనోత్సవాలు

పెద్దవడుగూరు : మండలంలోని రాంపురం గ్రామంలోని కొండపై ఈనెల 22 నుంచి మూడు రోజుల పాటు లక్ష్మీనరసింహస్వామి, నాగదేవత ఆలయాల్లో ప్రతిష్టాపనోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు. తొలిరోజు గణపతి పూజ, గోపూజ యాగశాల ప్రవేశం ఉంటుందన్నారు. 24న ఉదయం 8 గంటలకు యంత్ర స్థాపన, గోపురం, కలశ, ధ్వజస్తంభ ప్రతిష్ట ఉంటాయని తెలిపారు. మండలంలోని భక్తులు పెద్ద ఎత్తున పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామి కృపను పొందాలని కోరారు. ఈసందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.









నేడు ఆలయాల్లో శివరాత్రి వేడుకలు

పామిడి: స్థానిక భోగేశ్వరాలయంలో శనివారం మహాశివరాత్రిని ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. ఇదిలా ఉండగా శుక్రవారం రూ.1.5 లక్షలతో తయార చేసిన రథాన్ని ఆలయ చైర్మన్ మురళీధర్‌గుప్తా ప్రారంభించారు. ఆలయ కమిటీ సభ్యులు కవి నారాయణమూర్తి, వెంకట్రాముడు, వెంగమ్మ, సునీల్‌కుమార్‌రెడ్డి, హరి, మల్లి, మనోజ్, లక్ష్మినారాయణ, రమణ, పవన్ తదితరులు పాల్గొన్నారు.

గార్లదిన్నె: మహాశివరాత్రిని పురస్కరించుకుని గార్లదిన్నె, పెనకచెర్ల, పెనకచెర్ల డ్యాం, కల్లూరు, మర్తాడు, ఆలయాల్లో కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కోటంక సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ప్రసిద్ధి గాంచిన 108 సాల గ్రామ శివలింగాలు వద్ద శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.


పెద్దవడుగూరు : పూజలందుకున్న జోడు లింగాలు

పెద్దవడుగూరు : శివరాత్రి ఉత్సవాలకు పెద్దవడుగూరు, రాంపురం, చిత్రచేడు, క్రిష్టిపాడు, లక్ష్మంపల్లి, మేడిమాకుపల్లి, చింతలచెరువు, చిన్నవడుగూరు తదితర గ్రామాల్లో ఆలయాలు ముస్తాబయ్యాయి. చింతలచెరువులో జోడు లింగాలు ఉండటంతో ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఇదిలా ఉండగా శుక్రవారం చిన్నవడుగూరులో చెక్క భజన పోటీలు నిర్వహించారు.

శింగనమల: మండలంలోని చిన్నజలాలపురం కొండపై నున్న దోణరామేశ్వరాలయంలో మహా శివరాత్రి పండుగను పురస్కరించుకొని శనివారం రాత్రి పూజ కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆలయ అర్చకుడు సుబ్బరంగయ్యస్వామి తెలిపారు. భక్తులకు అన్నదానం నిర్వహిస్తామన్నారు.